
## ◆ ఈ వారం కథ



# పులుసు తపేలా

మానేపల్లి

నూకరత్నం మధ్యాహ్నం కాచిన చారంతా సాయంత్రానికి కారిపోయింది. తపేలాకి కన్నం వుండం వల్ల. అడుగున కాస్తంత చారూ, చింతపండు పుట్టెలో, రెండు ఎండు మిరపకాయలు,

రెండు కరివేపాకులూ మాత్రం మిగిలేయి. నోట్లో వేసుకుంటే— పుల్ల రొడ్డ. రాత్రికి అన్నంలోకి ఏ ఆధారమూ లేదు. ఏం చెయ్యాలో తోచక నూకరత్నానికి ఏడుపొచ్చేసింది.

వాన్నాళ్లనుంచీ పైడిరాజుతో ఒక తపేలా కొనమని చెబుతూనే వుంది. కాని అతగాడు వినిపించుకోలేదు. పైగా ఇప్పుడు కొత్త గొడవొకటి వొచ్చిపడింది. ఇక అసలు పట్టించుకోడు.

తనే ఏదో ఒక వుపాయం ఆలోచించు కోవాలి.

విజయనగరం కొత్త అగ్రహారంలో గాజులరేగ వెళ్లే మూలలోవున్న మిల్లుల్లో కొవ్వాడ వాళ్ల నూనెమిల్లే పెద్దది. ఆ మిల్లు యజమాని రెండోకొడుకు ఆడ కూలీ మీద అత్యాచారం చేసి, అది బయటపడటంతో కార్మికులు సమ్మె ప్రారంభించారు. బొత్తిగా తక్కువ జీతాలూ, ఏదోవంకన కూలీ డబ్బులు కోసేస్తూ వుండటం, బోనస్ ప్రావిడెంట్ ఫండ్ మొదలైనవి దాదాపు లేక పోవడం, ఎన్ని సంవత్సరాల నుంచీ పని చేస్తున్నా వాళ్లని రోజు కూలీలుగానే పని చేయించుకుంటూ ఏ సౌకర్యాలూ ఇవ్వక పోవడం— ఇలా సమస్యలు కొల్లలుగా వున్నాయి. మొత్తం పన్నెండు సమస్యల మీద సమ్మె ప్రారంభమయింది. క్రమంగా చుట్టు పక్కల వున్న ఎక్స్పెల్లర్ మిల్లులకీ, పిండిమిల్లులకీ కూడా పాకింది సమ్మె. సుమారు మూడు వందల మంది కార్మికులు సమ్మెలోకి దిగారు.

సమ్మె ప్రారంభమయి వారం రోజులయింది. ఈ వారం రోజులూ ఒక మాదిరిగా గడిచాయి. రెండో వారం కొంచెం ఒడుదుడుకుగా వుంది. నూకరత్నం మట్టి పిడతలో దాచిన చిల్లర డబ్బులు కొంచెం కొంచెం కరిగిపోనారంభించాయి.

సమ్మె చేస్తున్న కూలీలంతా పగటివేళ నీళ్లటాంకు రాతి గుట్టల దగ్గిరున్న చెట్ల కింద చేరతారు. సాయంత్రం అయితే బొడ్డువారి హోటల్ జంక్షన్ దగ్గర చేరతారు. మరొక జట్టు గాజులరేగ వెళ్లేదారిలో చెరువు గట్టు వారనున్న చెట్ల దగ్గర చేరతారు.

సమ్మె మరికొద్ది రోజుల్లో ప్రారంభమవుతుందనగా నూకరత్నం, పిడతలో డబ్బులు తీసి రెండు కోడిపిల్లల్ని కొన్నది. రెండూ పెట్టలే. ముద్దుగా తెల్లగా వున్నాయి. ఒకోటి అర్ధరూపాయి.

సమ్మె ప్రారంభమయి రెండు వారాలయింది. లక్ష్మీపురం నుంచి నూకరత్నం తల్లి, కూతుర్ను చూడ్డానికి వచ్చింది. అడ్డదారంట నడిచే వచ్చింది. వస్తూ వస్తూ మూడు కుంచాల బియ్యమూ, కుంచెడు కందులూ మూట కట్టి తెచ్చింది. ఒక అరవీశెడు నవనవలాడే వంకాయలూ, పచ్చి మిరపకాయలూ కూడా తెచ్చింది. ఒక పూట వుండి వెళ్తూ, వెళ్తూ చిక్కం సంచిలోంచి

దోసెడు చిల్లర డబ్బులు తీసి కూతురు చేతిలో పోసింది. ఆ చిల్లరలో పావలాయే అతి పెద్ద నాణెం.

అయిదారు పావలాల దాకా వుండొచ్చు. మిగతా అన్నీ ఇరవై పైసలు, పది పైసలు, అయిదు పైసలు, మూడు పైసలు, రెండు పైసలు నాణాలే వున్నాయి. ఇక పది వరకూ రాగి నయాపైసలూ వున్నాయి. ఇప్పుడు నయాపైసలు ముష్టివాళ్లుకూడా పుచ్చుకోకుండా వున్నారు.

"ఒద్దులేయమ్మా. నా కాడా పిడతలో సిల్లరున్నాది" అన్నాది మాకరత్నం.

"పుణ్ణీ పుణ్ణీ ముందు ముందుకు పనికొస్తాది. సిల్లర శ్రీమహాలచ్చిమి అంటారు. వుంచు వుంచు" అన్నాది తల్లి.

మాకరత్నం చిల్లర లెక్కబెట్టింది. పన్నెండు రూపాయల ముప్పయ్యారు పైసలుంది. లెక్క పెడుతుంటే కొడుకు సింహాచలం వచ్చాడు. వాడికి మూడేళ్లు.

"అమ్మా నాకో పైసియ్యే. ఏటన్నా కొనుక్కుంతాను" అన్నాడు, సింహాచలం, చీమిడిముక్కు ఎగజీదుతూ.

"ఏటి కొంతావురా" అని మనవణ్ణి చేరదీసింది, మాకరత్నం తల్లి.

"కొబ్బిరుండ కొనుకుంతాను" అన్నాడు సింహాచలం, పళ్లన్నీ కనపడేలా నవ్వుమొహం పెట్టి.

"కొబ్బిరుండ కొనుకుంతావా" అని ముద్దు చేసింది, ముసిల్ది.

"ఇందరా మూడు పైసలు—" అని మాకరత్నం కొడుక్కి మాసి మాసి మూడు పైసల బిళ్ల యిచ్చింది.

"మూడు పైసలేటి తియ్యే. ఐదు పైసలియ్యి" అన్నాది మాకరత్నంతల్లి.

"మూడు పైసలకి కొబ్బిరుండ వస్తాదే" అని, ఐదు పైస లివ్వడానికి ఒప్పుకున్నది కాదు మాకరత్నం.

మాకరత్నం చిక్కంతో టే చిల్లర డబ్బులు ఎవ్వరికీ కనపడకుండా అతిభద్రంగా దాచింది.

అన్నం గిన్నె సొట్టలు పడింది. ఒక శేరు బియ్యం ఉడికేలాగ ఓ స్టీలు గిన్నె కొనాలని మాకరత్నానికి చాన్నాళ్లనుంచీ వున్నాది. పులుసు దాక సరేసరి. కన్నం పడింది. చింతపండు పెట్టింది. సబ్బు ముక్క తడిపి అంటించింది. అయినా ఒరుస్తూనే వుంది. ఇది కాదు పనని ఆ కన్నం వరకూ చుట్టూ దట్టంగా మసి పట్టించేసింది. పేరుకు సిల్వరు దాకే గాని, నల్లగా బొగ్గులా మట్టిదాక లాగా వుంది. రోజూ కడుకుతుంది గనక అంచులు మాత్రం తెల్లగా మెరుస్తున్నాయి. మూత అదీ అలాగే వుంది. సొట్టలుపడి బొత్తిగా అరిగిపోయింది. వంటకి సరిపడిన స్టీలు సామాన్లు కొనుక్కుని తళతళ లాడేలా పొయ్యి బుగ్గిపెట్టి తోమి, బల్లమీద సైజుల వారీగా పేర్చుకుని కళ్లారా చూడాలని మాకరత్నానికి మాత్రం తెలియదూ! కాని సుఖాల గురించి కలలు కనడమే లేక పోతే ఈ బ్రతుకులు మరింత దుఃఖమయం కావూ!

పైడి రాజుకు తాగుడు అలవాటు లేదు. అప్పడప్పుడు, అంటే జేబులో నాలుగు డబ్బులు ఎక్కువ గలగల లాడుతున్నప్పుడూ, పండుగలప్పుడూ ఓ చుక్క వేసుకుంటుంటాడు.

### 'నటిం'చవు

'దూరదర్శన్' తెలుగు కార్యక్రమాలపై ప్రజాభిప్రాయం తెలుసుకోవాలనుకున్నారు ఆ విభాగం ఉద్యోగులు. ఆ సందర్భంగా ఒకాయనను కలుసుకొని, ఇలా అడిగారు —

"మీరు టి.వి.లో నాటకాలూ, నాటికలూ చూస్తుంటారా?"

"ఉహూ... పొలం పని, పశువుల పెంపకం చూస్తుంటాను."

"అవే ఎందుకు నచ్చుతున్నాయో తెలియజేస్తారా?"

"ఎందుకంటే అందులో కనిపించే గేదెలూ, ఎద్దులూ, పందులూ, సహజంగా వుంటాయి. నటించవు కనుక..." అన్నాడా దుర్ధర్ముడు.

పైడి రాజుకు బ్రాకెట్టాట మాత్రం అలవాటుంది. ప్రతి రోజూ పావలా అర్ధా కడుతూనే వుంటాడు. రెండేళ్ల క్రితం ఒకే ఒకసారి అర్ధ రూపాయి కడితే పాతిక రూపాయలొచ్చాయి. అంతే,

అంతకుమించి ఒక్కనాడూ అదృష్టం పలకలేదు. గత పది సంవత్సరాల నుంచీ బ్రాకెట్టాటకి తగలేసిన డబ్బు ఒక డబ్బాలో వేసి వుంచితే— ఎంత లేదన్నా వెయ్యి రూపాయలయి వుండును, ఈ పాటికి.

సమ్మె విషయంలో యజమానుల్తో సంప్రతింపులకి అరడజను మంది వెళ్లారు, కార్మిక సంఘం తరపు నుంచి. ఆ అరడజను మందిలో పైడిరాజు కూడా వున్నాడు.

అత్యాచారానికి గురయిన ఆడకూలీకి అయిదు వేల రూపాయల నష్ట పరిహారం ఇవ్వాలని ఒక షరతు.

'మేం పైసా ఇవ్వం. పది మందితో పోయేదానికి నష్టపరిహారం ఏమిటి!' అనే పరిస్థితి నుంచి,' వెయ్యి రూపాయలిస్తాం ' అనే కాడికి వచ్చింది. కార్మికులకు సంతృప్తి కలగలేదు.

—జీతాలు పెంచాలి.

—ఏడాదికి ఒక జత బట్టలిస్తున్నారు కొన్ని మిల్లుల్లో. అన్ని మిల్లుల్లోనూ రెండేసి జతల బట్టలివ్వాలి.

ఈ రెండు కోరికల దగ్గర వాళా పేచీ వచ్చింది. బోనస్ దగ్గర ఇంకా పెద్ద పేచీ వచ్చింది.

చర్చలు విఫలమయ్యాయి.

లేబర్ ఆఫీసర్నీ, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్నీ కలిశారు. ఫలితం శూన్యం.

"అంచాలు మేయిస్తి ఆ నా కొడుకులనలే మాటాడరు" అన్నాడు, సన్యాసినాయుడు. అతగాడొక కార్మిక నాయకుడు.

సమ్మె ప్రారంభమయి నెల రోజులు కావస్తున్నది. కూలీ కుటుంబాలు కటకటలాడి పోతున్నాయి.

లోగడ రాక పోలేదుగాని, ఇప్పుడు రాజకీయ నాయకులు కూడా రంగంలోకి దిగారు...

కావిడి మీద సిల్వరు సామాన్లు పెట్టుకుని కిష్టయ్య వచ్చాడు. పాకల్లో జనం బిల బిలలాడుతూ చుట్టూ మూగారు. ఒక తపేలా మాసేవరికి మాకరత్నానికి బాగా నచ్చేసింది. దాని మీద మూతకూడా బాగా అమరింది. పులుసు పెట్టుకోవడానికి వాలా బాగుంటుంది. చక్కగా దాంతో చేపల పులుసు పెట్టుకుంటే మంచి సవందుగా వుంటాది. దాంతో చిక్కగా పులుసు పెట్టుకున్నట్టూ, పైడి రాజూ తనూ కలిసి కబుర్లాడుకుంటూ తింటున్నట్టూ పంచ రంగుల కలలు కనేసింది మాకరత్నం.

ధర కనుక్కుంది.

పాతిక చెప్పాడు.

బేరం అటు సాగింది. ఇటు సాగింది.

పదహారు రూపాయల దగ్గర నిలిచిపోయింది.

పిడతలో డబ్బులు ఏనాడో అయిపోయాయి.

తల్లి ఇచ్చిన డబ్బుల్లోనూ కొంత చిల్లరకి తీసింది.

"ఓలమ్మ పదార్రూపాలు ఎక్కణ్ణించి తెద్దునూ?" అనుకుంది. కాదు—పైకే అనేసింది.

పది రూపాయల కివ్వవా అనడిగింది.

పన్నెండు కివ్వవా అని కూడా అడిగేసింది, ఆఖరి సారి.

నిజానికి పన్నెండు రూపాయలు మాత్రం ఎక్కడున్నాయి? మూతతో సహా పులుసు తపేలా కొనాలని మా పెద్ద ఆరాటంగా వుంది.

ఎక్కడెక్కడలేని చిల్లర డబ్బులూ కూడదీస్తే పదిం పావలా అయింది, కనా కష్టం మీద.

చివరికి, తెగించి—

"ఇప్పుడు పది రూపాయలు తీసుకో, నాల్రోజులు పోయాక వస్తే మిగతా ఆరూ ఇచ్చేస్తా" నంది.

రెండు కోడి పిల్లలూ— పిల్లలు కావు బాగా ఎదిగాయి, చిన్న పెట్టల్లా వున్నాయి— అమ్మేస్తే ఆ పాటి ఆర్రూపాయలు రాక పోతాయా అని ఆలోచించింది.

"ఈ అరువు బేరాలు, నాకాడ పనికిరావు. కాళ్లరిగిపోయేలా మీ గుమ్మాలంట నేను తిరగలేనన్నాడు కిష్టయ్య.

మహాలక్ష్మిని బ్రతిమాలింది మాకరత్నం. నువ్వు కొంచెం కిష్టయ్యతో సర్ది చెప్పమంది.

"నాల్రోజులు పోయాక రా. ఇచ్చేస్తాది. ఒకేల మాకరత్నం యివ్వలేక పోతే నేనిస్తాను. ఇంతా జేస్తే ఆర్రూపాయలేకదా" అని కిష్టయ్యతో చెప్పింది మహాలక్ష్మి.

మహాలక్ష్మి ఎప్పుడూ ఎవ్వరికీ అరువు పెట్టదు. మాట చిక్కుచ్చి. కనక, మహాలక్ష్మి మాటంటే కిష్టయ్యకి గురి. మెత్తబడ్డాడు.

"ఇయ్యాల బుధవారం కదూ. రేపు శనివారం నాడొస్తాను. యియ్యకపోతే మాత్రం మాటదక్కదు. ఆ!" అన్నాడు.

మాకరత్నం సంతోషానికి మేరలేదు. లక్ష రూపాయల లాటరీ పేలినంత సంతోషంగా వుంది. బంగారపు జరీ పట్టుచీర కట్టుకున్నంత సంబరంగా వుంది.

పైడి రాజు చూస్తే తిడతాడు. కూలీ డబ్బుల్లేక నానా గడ్డీ గరుస్తుంటే, నీకు కొత్త పులుసు తపేలా



అమెరికా సంబంధం

డాక్టర్ కొత్త రవీంద్రబాబు

సరికొత్త సీరియల్ త్వరలో!..


కావలసొచ్చిందా అని. నానా బూతులూ తిడతాడు.

పది రూపాయలు కిష్టయ్య కిచ్చేస్తే, పావలా అంటే పావలాయే మిగిలింది. మరి ఇల్లంతా వెదికినా ఒక్క పైసలేదు. తల్లి ఇచ్చిన తిండి గింజలూ, కందులూ వున్నాయి గనుక ఇన్నాళ్లూ ఎలాగో గడిచింది. కంది పప్పు పులుసు రోజూ ఎంతకని తింటారు?

పైడిరాజు రానే వచ్చాడు. పిడతలోని చిల్లర డబ్బులిమ్మనడిగేడు. క్లోజింగ్ జీరో, ఓపెనింగ్ నైనూ ఖాయమట. చెరో అర్థ రూపాయి కడతాను ఒక రూపాయిమ్మని కూమన్నాడు.

"లేదు. లేదు గాక లేదు పిడత పగలగొట్టేసి చూసుకో. ఇంద. పగల గొట్టే" అని పిడత చేతికిచ్చేసింది.

కాస్సేపు చిందులు తొక్కేడు.

"ఇన్నాళ్లూ పై కరుసులు ఎలా గడుస్తున్నాయనుకున్నావూ? ఆ పిడతలో డబ్బులే కరుసు పెట్నాను. సరి మరి లేవు" అని చేతులు గిరగిర తిప్పుతూ గట్టిగానే చెప్పేసింది.

గొణుక్కుంటూ చల్లగా వెళ్ళిపోయేడు.

మర్నాడు మళ్లీ చర్చలు, యజమానులకీ కార్మికులకీ. చర్చలు కొంతదారిలో పడినట్టే వున్నాయి. కాని పూరాగా తెగలేదు. "ఎల్లుండే మళ్లీ కూమందాం" అనుకున్నారు ఉభయ పక్షాల వారూను.

ఆ రోజు చాలా విసుగ్గా యింటి కొచ్చాడు పైడిరాజు. కొద్దిగా ముక్క కూడా వేసుకున్నట్టే వుంది. కొత్త పులుసు తపేలా వాడి కాలికి తగిలింది.

చేత్తో తీసి ఎత్తిపట్టుకున్నాడు.

ధగధగ మెరిసి పోతోంది. ఒక్కసారీ పొయ్యెక్కినట్టు లేదు, కొత్తగా వుంది.

"ఇదెప్పుడు కొన్నావే నూకాలూ"

నూకాలు, నూకీ, నూకా, నూకరత్నం— ఇలా రకరకాలుగా పిలుస్తాడు. బాగా కులాసాగా వున్నప్పుడు నూకరత్నం అని పూర్తి పేరుతో పిలుస్తాడు. ఒళ్లు తెలియని ఆనంద పారవశ్యంతో స్వర్గంలో తేల్తున్నప్పుడు 'రత్నం' అని కూడా పిలుస్తాడు.

'అది మాయమ్మ కొని పెట్టింది. మన పులుసు తపేలా చిల్లు పడిపోయింది. నీకు శానామట్లు చెప్పేను కదేటి"

"సెప్పినావులే. మీ యమ్మ కొత్త తపేలా కొని పెడితే మరి ఆ ముక్క ఎందుకు చెప్పేవుకావు?"

"సెబుదామనుకుని మర్సిపోనాను"

ఇంతలో కోడి పెట్టల గురించి అడిగేడు. వాట్నే రెండిట్నీ పొద్దునే ఎనిమిది రూపాయల కమ్మేసింది. చిన్న పెట్టలు.

"సెప్పడం మర్సిపోయేను. పొద్దున్న గద్ద తన్నుకు పోనాది. మాయదారి గెద్ద"

"యేటీ— నీయమ్మ... టౌనులోకి గెద్దలెలా గొస్తాయే, మనం యేటి సొశానంలోగానుంటున్నామా—

రెండు పెట్టల్నీ అమ్మేసి ఈ తపేలా కొనేసినావు—"

దొంగతనం బయటపడిపోయింది.

"చిన్న రూపాయిమ్మంటే ఇచ్చేవుకావు. కుంటి గురవయ్య చెప్పేదు కూడాను, ఇరవయి రూపాయలొచ్చేయట. మనకా రాతలేదు. ఇదుగో ఈ తపేలా కొన్నావు. ఎందుకే ఇది. అడుక్కోడానికా— ఆ— ఎందుకది— ఎందుకంట?"

తపేలా చేతిమొయ్యా రోడ్డు మీదకి గిరాటేశాడు. రోడ్డు మీద మట్టిలో ఆడుకుంటున్న కొడుకు సింహాచలానికి తగిలింది. గలగలలాడుతూ ఏడుపు మొదలు పెట్టాడు.

నూకరత్నానికీ నాలుగు తన్నులు తగిలాయి.

"నెల్లాళ్లయి (టయికు. డబ్బుల్లేక నానా సావూ సత్తాంటే నువ్వు కొత్త తపేలా కొంటావా? నీ సోక్కు ఇదొక్కటే తక్కువ—"

పాకంతా గందరగోళం చేయిశ్నాడు. మట్టి పిడత పగలగొట్టాడు. పావలా దొరికింది. కోళ్ళమ్మిన ఎనిమిది రూపాయలూ ఇంకా కిష్టయ్యకియ్యలేదు. రేపొస్తాడు, ఇవ్వొచ్చని దాచింది. అవిగాని దొరికిపోతాయేమోనని హడిలిపోయింది. దాయమని మహాలక్ష్మికన్నా ఇచ్చేను కానని తెగ నొచ్చుకుంది.

పగిలిన పిడతలో దొరికిన పావలా జేబులో వడేసుకున్నాడు. "బీడీలకి పనికొస్తాది." తూలుకుంటూ వెళ్ళిపోయేడు.

రోడ్డు మీదకి విసిరేసిన తపేలా తెచ్చింది. నయమే, సొట్టపడలేదు. ఏడుచుకుంటూ పాకంతా సర్దింది. కొడుకును ఊరుకోబెట్టింది. దీపాలు పెట్టే అన్నం వండి, ఇంత చింతపిక్కంటే చారుకాసింది. నంజుకుందుకు నాలుగయిదు తెలగ పిండొడియాలున్నాయి. ఎలాగో పూట గడిచిపోతుంది.

జరిగిందంతా మహాలక్ష్మికి చెప్పి, "ఈ డబ్బు నీకాడే వుంచేలప్పా" అన్నది. ఆ రాత్రి రెండో ఆట వొదిలేకగానీ పైడిరాజు ఇంటికి రాలేదు. వచ్చి, కూడు దినకుండానే తొంగుండి పోనాడు.

శనివారం రానే వచ్చింది. కావిడేసుకుని కిష్టయ్య వచ్చాడు. కిష్టయ్య బాకీ తీర్చగా రెం(డూపాయలు మిగిలాయి. తిన్న తన్నులు ఎలాగూ తిన్నావని, రూపాయి పావలా పెట్టి. గరిటె కొన్నది.

తపేలా.

దాని మీద మూత

కలుపుకునే గరిటె

మూడూ అమిరాయి.

ముప్పావలా మిగిలింది.

"అప్పా మహాలక్ష్మప్పా. ఈ డబ్బులు తీసుకెళ్లి నీడబ్బులు పావలో, అర్ధోయేసి సేపలు తెమ్మీ.

ఇయ్యాల కమ్మగా జిమ్మ లెగిసేలా పులుసు పెడతాను" అని మహాలక్ష్మిని (బతిమాలింది. మహాలక్ష్మి గంట స్తంభం దగ్గరున్న మార్కెట్టుకు పని మీద వెళ్తున్నాది.

మహాలక్ష్మి తన దగ్గరున్న అర్ధరూపాయవేసి, రూపాయి పావలా పెట్టే అయిదు చిన్న చిన్న మట్టగిడసలున్న గుత్తి తెచ్చింది. (బతికే వున్నాయి చేపలు. తనకి రెండున్నర పెట్టే పెద్ద వంజరం తెచ్చుకుంది.

"శానా బాగున్నాయి సేపలు. నీకు అర్ద రూపాయియ్యాలి. ఎలాగయినా ఆ పాటి సిల్లర కూడదీసి యిచ్చేస్తానులే—" అని మురిసిపోయింది నూకరత్నం, చేపల్ని పట్టుకుని చూసి.

రోజూ కంటె ఒక గుప్పెడు బియ్యం ఎక్కువ పోసి అన్నం వార్చింది. చిక్కగా పులుసు పెట్టింది. వేడి వేడి పులుసు గరిటెతో తీసి రెండు మూడు సార్లు వూది ఎడం అరచేతిలో వేసుకుని నాలికతో నాకింది.

"మా పెద్ద రుచిగా వుంది పులుసు" అని లొట్టలు వేసింది. ఉడుకు నీళ్లు స్నానం చేసి, ఉన్నంతలో మంచి చీర కట్టుకుంది. పైడిరాజు ఈ పులుసు తిన్నాడంటే తప్పక మెచ్చుకుంటాడు.

లొట్టలేసుకుంటూ ఇంకో రెండు ముద్దలు ఎక్కువే తింటాడు.

ఎనిమిదయింది. బొడ్డువారి హాల్లో ఇంటర్వెల్ ఇచ్చినట్టున్నారు. జనంగోల వినిపిస్తోంది. చల్లని చలిగాలి వీచింది. శీతకాలం. పొద్దునవగా వెళ్ళేడు పైడిరాజు. మిల్లు యజమానుల్తో చర్చలున్నాయట.

